క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని కరంజి గ్రామంలో మైసమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ ఎస్సైగా అఖిల్



అఖిల్

నార్నూర్: నార్నూర్ ఎస్సైగా అఖిల్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శిక్షణ ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలన్నారు.

సప్తాహం ముగింపు



భగవద్గీత పారాయణంలో ప్రధాన శిష్యులు

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకిలో ఊరేగించారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. చివరగా కాలదహీ హండీ నిర్వహించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర ఇంటింటా కుటుంబ, కుల గణన చేపట్టడంతో కేంద్రంలో కదలిక వచ్చిందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చంటి, ఉమేష్, షాకీర్, అబూద్, పురేందర్, గడ్డల నారాయణ, గంగాధర్, షాకీర్, అక్బార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది సన్మానించారు. 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన అనుశ్రీని పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కిష్టన్న, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగదు అందజేత

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన ముద్దం రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బీద పరిస్థితుల్లో కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా స్పందించిన పలువురు పంపిన రూ.33000 లను గ్రామస్తులు కుటుంబానికి శుక్రవారం అందజేశారు.

చెక్కు పంపిణీ

తలమడుగు: మండలంలోని లచ్చమ్‌పూర్ గ్రామానికి చెందిన సారంగ రమేశ్ కుమార్తె దీక్షితకు మంజూరైన రూ. 30 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, జంగు పటేల్, ఆనంద్‌రావు, వెంకన్న, రాకేశ్, రావుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

బేల: మండలంలోని బాది గ్రామానికి చెందిన రైతు నిమ్మల రాంరెడ్డిపై శుక్రవారం అడవిపంది దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఎండలో ఆటలొద్దు..!

- ప్రారంభమైన వేసవి సెలవులు
- ఆటపాటలతో చిన్నారుల సందడి
- తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ఎండలో ఆటలు ఆడుతున్న చిన్నారులు (ఫైల్)

ఆదిలాబాద్: పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 24 నుంచి సెలవులు మొదలు కావడంతో చిన్నారులు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. మరోవైపు మే మొదటి వారంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. రాష్ట్రంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలో నమోదవుతుండడం గమనార్హం. హాఫ్ సెంచరీ దిశగా ఉష్ణోగ్రతలు ఎగబాకుతున్నాయి. దీంతో పలువురు వడదెబ్బతో మృత్యువాత పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళలతో పోలిస్తే పది తర్వాత తీవ్రమైన ఎండల నేపథ్యంలో చిన్నారులపై తల్లిదండ్రులు, సంరక్షకులు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు..

ఉదయం, సాయంత్రమే మేలు..

భానుడి తీవ్రత నేపథ్యంలో 11 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఏదైనా అత్యవసర పని ఉంటే తప్పితే బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రతలు సైతం 40 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదవుతుండడం, వడగాలులు వీస్తుండటం, ఉక్కపోతలాంటి వాతావరణంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చిన్నారులు నీడపట్టునే ఉంటూ ఉదయం సూర్యోదయానికి ముందు సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత మాత్రమే ఆడుకునేలా చూడాలని వైద్యులు తెలుపుతున్నారు. ఎండ వేడిమి ప్రభావం ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల పైన అధికంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బకు గురైన వారు తల తిరగడం, ఒళ్లంతా చెమటలు పట్టడం వంటి లక్షణాలతో ఉంటారు. శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుంది. వేడిని తగ్గించుకోవడం కోసం వేగంగా శ్వాసిస్తుండడం వలన గుండె వేగం అధికంగా ఉంటుంది. వడదెబ్బ ప్రభావంతో కళ్లు తిరగడం, కాళ్ల వాపులు, శరీర కండరాలు పట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎండ ప్రభావానికి గురైన వారు తీవ్ర అలసటగా కనిపిస్తారు. ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి.

సమయమివ్వాలి..

చిన్నారులు సాధారణంగా వారి స్నేహితులతో గడపడానికి ఇష్టపడుతుంటారు. అయితే వారి దృష్టి మరలకుండా కుటుంబసభ్యులే వారికి అధిక సమయాన్ని వెచ్చిస్తే చిన్నారులు ఇంట్లోనే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. మైదానాల్లో ఆడే ఆటలే కాకుండా ఇంట్లోనే చదరంగం ఆడించడం, కథల పుస్తకాలు చదివిస్తూ అందులోని నీతిని తెలపడం, తల్లిదండ్రులు, తోబుట్టువులు, అమ్మమ్మలు, తాతయ్యలు వారికి కథలు చెప్పడం వంటివి చేస్తే ఎంతో ఆసక్తిగా ఇంటి వద్దనే ఉంటూ నూతన విషయాలు అభ్యసిస్తారు. అదేవిధంగా దినపత్రికలు చదివే అలవాటు చేయించడ, పుస్తక పఠనం పట్ల అనురక్తి కలిగించడం వలన ఎన్నో విషయాలపై అవగాహన కలుగుతుంది.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు..

తేదీ	గరిష్ట ఉష్ణోగ్రత	కనిష్ట ఉష్ణోగ్రత
26	41.3	30.2
27	38.3	26.4
28	42.3	26.7
29	43.6	29
30	43.3	29.7
01	45.2	25.5
02	42.8	23.2

జాగ్రత్తలు పాటించాలి



వేసవి నేపథ్యంలో చిన్న పిల్లల్ని బయటకు తీసుకువెళ్లకపోవడమే మంచిది. చిన్నారులకు తరచుగా మంచినీరు ఇవ్వాలి. అదే విధంగా చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. చిన్న పిల్లలు, వృద్ధులపై ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. అత్యవసరమైతే తప్పా.. వారు ఉదయం 11 గంటల లోపు సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే బయటకువెళ్ళవచ్చు. కొబ్బరి నీరు, వాటర్ మిలన్ లాంటివి ఎక్కువగా తీసుకోవాలి.

– క్రాంం వెంకట్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్, ఆదిలాబాద్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల 42 వేల చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. తలమడుగు మండలంలోని ఉండం గ్రామానికి చెందిన చోటే ఖాన్‌కు మంజూరైన రూ.45 వేలు, నేరడిగొండ మండలంలోని తర్నం గ్రామానికి చెందిన కామెరి రాజేశ్వర్‌కి రూ.27 వేలు, ఇచ్చోడ మండలంలోని ఆడిగావ్(బి)కి చెందిన సావుబాయికు రూ.60 వేలు, సొనాల మండల కేంద్రానికి చెందిన బొరిగేవు సుశీలకు రూ.16,500, బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డికి రూ.25,500, తొర్తి రవికు రూ.41,500, నల్ల రాజేశ్వర్ రెడ్డికి రూ.16,500, ముసుకు రాజేశ్వర్ రెడ్డికి రూ.10 వేలను అందించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, అభిరాం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జక్కు శ్రీధర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

నేరడిగొండ: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పెద్దబుగ్గారం గ్రామస్తులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. యువ నాయకులు రాథోడ్ సురేందర్, పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి అనుసంధానం చేయాలి



మాట్లాడుతున్న కొండయ్య

ఆదిలాబాద్‌టౌన్: కడెం, జన్నారం, దండెపల్లి మండలాల రోడ్డును జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని జన్నారం మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ కొండయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఖానాపూర్ నుంచి లక్షెట్టిపేట వరకు విస్తరించి ఉన్న రహదారి 24 అప్‌గ్రేడ్ ఖానాపూర్ జంక్షన్ వద్ద ఎన్‌హెచ్ 61 నుంచి 63 వరకు లక్షెట్టిపేట్ జంక్షన్ ఎన్‌హెచ్ 61కు అనుబంధానం చేయాలన్నారు. జన్నారం, దండేపల్లి, కడెం మండలాలు దశాబ్దాలుగా పెద్ద నగరాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. మూడు మండలాల్లో గిరిజనులు ఎక్కువ మంది ఉన్నారని, జాతీయ రహదారికి కనెక్టివిటి లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ కోకన్వీనర్ చంద్రయ్య, సత్యం, అశోక్, సాబిర్ పాషా, అక్బర్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న రాథోడ్ సికెందర్

నార్నూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన వారికి అన్యాయం జరుగుతుందని పేసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికెందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ భిక్కు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాష్ మద్దతు తెలిపారు. నార్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 18 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏజెన్సీలో ప్రాంతంలో గిరిజన చట్టానికి వ్యతిరేకంగా కమిటీ ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట శ్రీకాంత్, హన్మండ్లు, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు..

సర్వేలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ నాయకుడు మాజీ సర్పంచ్ సంతోష్ ఆరోపించారు. శుక్రవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఉమ్రీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే కోసం అధికారులు గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒకరిద్దరి ఇంట్లో కూర్చొని ఎంపిక చేశారని మండిపడ్డారు. లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు.

'ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి'



మాట్లాడుతున్న మల్యాల మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో దళిత గిరిజన సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ కమిటీలను వేయకుండా ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా జిల్లా కలెక్టర్, మండల, మున్సిపాలిటీలలో అధికారుల ద్వారానే అమలు చేసేలా చూడాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జువ్వాక నర్సింలు, సోనేరావు, లక్ష్మణ్, కిషన్, బాలు, గోవింద్‌రావు పాల్గొన్నారు.

పెట్రోల్ దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ దొంగతనం చేసిన యువకుడు షేక్ నదీమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. ప్రవీణ్ తన ఇంటి ముందు ఉదయం 5 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి వాకింగ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చిన సమయంలో ఆటోలో నదీమ్ వచ్చి ద్విచక్ర వాహనంలో నుంచి పెట్రోల్ దొంగలిస్తున్న క్రమంలో పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డుపై పశువులను వదిలేస్తే చర్యలు

ఇచ్చోడ: జాతీయ రహదారిపై పశువులను వదిలేస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పశువులతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలను వివరించారు. పశువుల యజమానులు రోడ్లపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కేంద్రే బాలాజీతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యుడు పడావల్ విజయ్‌సింగ్‌లకు ఇంద్రవెల్లి కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మాజీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, దిలీప్ మోరే, కోవ రాజేశ్వర్, రాథోడ్ రాధిక, రాథోడ్ భీంరావ్, చరక్ సుధీర్, పెందోర్ గణేష్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈ జాదవ్ సుభాష్

నార్నూర్: విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఉట్నూర్ డివిజన్ డీఈ జాదవ్ సుభాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి విద్యుత్ భద్రత వారోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించడం, సురక్షితంగా ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రతీ సంవత్సరం మేలో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ రవి, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'



చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: పేదలకు వరం కల్యాణలక్ష్మి అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. మహిళల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

పరామర్శ..

మండల కేంద్రంలోని సేవాదాస్‌నగర్ కాలనీకి చెందిన పోలీసు హెడ్‌కానిస్టేబుల్ గాయక్వాడ్ దాదారావు కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించారు. విధి నిర్వాహణలో చురుగ్గా ఉండే కానిస్టేబుల్ పక్షవాతం రావడం బాధాకరమన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

ప్రతిఒక్కరూ జ్ఞానాన్ని సంపాదించి మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో జరిగిన ఛాత్రోపాధ్యాయుల వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం ఛాత్రోపాధ్యాయులు బీజం వేయాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సభ్యులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషాను చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. నార్నూర్ మండలం అభివృద్ధి పథంలో తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దినేష్ మటోలియా, ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, మనోహర్, సూర్యకాంత్, సంతోష్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: కులగణనపై ప్రధాని నరేంద్ర మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీంరెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, తుల్సిరాం, డుకురే దామోదర్, పాండురంగ్, కేంద్రే నారాయణ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి)లో శుక్రవారం ప్రధానిమోదీ చిత్ర పటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశంలో జనగణనతో పాటే కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడాన్ని హర్షణీయమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, దేవన్న, దత్తు, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధిహామీ సిబ్బంది

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధిహామీ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. శుక్రవారం గత నాలుగు నెలలుగా వేతనాల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్ సిబ్బంది నిరసనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వెంకట్‌రాజు, టీఏ, ఎఫ్‌లు, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిరికొండ: మండలంలోని చిమ్మన్‌గూడి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో నాగస్వామి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా ఇసుకను తలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్న ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐ శిక్షణతో సృజనాత్మకత



సమ్మర్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎంఈవో

నేరడిగొండ: ఏఐ శిక్షణతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని మండల విద్యాధికారి భూమారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏఐ శిక్షణ శిబిరం ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేందుకు శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.